ప్రజాశక్తి
గురువారం 9 నవంబర్ 2023
5
విజయనగరం

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో జరుగుతున్న అభివద్ధి పనుల్లో నాణ్యతా లోపాన్ని సహించబోమని కమిషనర్ ఆర్ శ్రీ రాములునాయుడు హెచ్చరించారు. క్షేత్రస్థాయి లో సహాయకుల పర్యవేక్షణ కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పూర్తయిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎస్‌పి బంగ్లా రహదారి ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి రోడ్డు నిర్మాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు వేగవంతంతో పాటు నిర్మాణ నాణ్యత కూడా ముఖ్యమైనది కాంట్రాక్టర్లు గ్రహించాలన్నారు. పని పూర్తి అయ్యేంతవరకు క్షేత్రస్థాయిలో పరిశీలకులను నియమించాలని చెప్పారు. తాము చేపట్టే ఆకస్మిక తనిఖీలలో నాణ్యత లోపాలను, విధానపరమైన లోపాలను గాని సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఇఇ దక్షిణామూర్తి, డిఇలు పాల్గొన్నారు.

ఇటీవల బొబ్బిలి సమీపంలో బోల్తాపడిన ఆర్‌టిసి బస్సు

ఎపిఎస్ ఆర్‌టిసిలో గడిచిన రెండు దశాబ్ధాలుగా అనుసరించిన ప్రైవేటీకరణ విధానాల ప్రభావం ప్రస్తుతం దుష్ప్రభావాలు చూపుతున్నాయి. బస్సులు ఎక్కడికక్కడ మొరాయిస్తుండడంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందుకు బస్సు డ్రైవర్లను, సూపర్ వైజర్లను బాధ్యులుగా చేసి, చేతులు దులుపు కుంటున్నారు. మరోవైపు ఆర్‌టిసిలో ఏటా ఖాళీ అవుతున్న పోస్టులను భర్తీ చేయడం లేదు. ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ సిబ్బందితో కాలక్షేపం చేస్తున్నారు. వారికి పనిభద్రత కూడా కొరవడుతోంది. రెండు రోజుల క్రితం విజయవాడ బస్టాండ్, అనంతరం పురం కలెక్టరేట్ వద్ద ఆర్‌టిసి బస్సులు దూసుకుపోయి పలువురు మృతి చెందిన నేపథ్యంలో ఆర్‌టిసి బస్సుల ఫిట్‌నెస్‌పై చర్చ జరుగుతోంది.

అతుకుల బొంత ఆర్‌టిసి

- ప్రయివేటు సంస్కరణలతో పనిభారం
- డొక్కు బస్సులతో ప్రజా రవాణా
- భర్తీకాని పోస్టులు
- ఔట్‌సోర్సింగ్, రోజువారీ కూలీలతో కాలక్షేపం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఆర్‌టిసి రీజియన్ పరిధిలో విజయనగరం, ఎస్.కోట డిపోలు ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో పార్వతీపురం, పాలకొండ, సాలూరు డిపోలు ఉన్నాయి. విజయనగరం ఆర్‌టిసి డిపో పరిధిలో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రాడీలక్స్, డీలక్స్ బస్సు సర్వీసులన్నీ కలిపి 144 మాత్రమే ఉన్నాయి. ఎస్.కోట డిపో పరిధిలో 46 బస్సులు మాత్రమే ఉన్నాయి. మన్యం జిల్లాలో ఆర్‌టిసి బస్సులు 236, అద్దె బస్సులు 75ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు విజయనగరం డిపో పరిధిలోని 80 నుంచి 100 బస్సుల వరకు రోజువారీ మెయింటెనెన్స్ కోసం గ్యారేజీకి వెళ్తున్నాయి. గేర్ రాడ్స్, క్లచ్‌ప్లేట్స్, యాక్సలేటర్స్, బస్సుకు అత్యంత కీలకమైన పిపి సాఫ్ట్ (ఇరుసు) మరమ్మతులు తరచూ చేయాల్సి వస్తోంది. కానీ, వీటిని బాగుచేయడానికి అవసరమైన హార్డ్‌వేర్ సామగ్రి (విడి పరికరాలు) స్థానిక స్టోర్ రూంలో అందుబాటులో ఉండడం లేదని గ్యారేజీలో పనిచేస్తున్న సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో, అప్పటికప్పుడు అతుకుల బొంత మాదిరిగా తాత్కాలిక మరమ్మతులు చేపట్టాల్సిన దుస్థితి దాపురిస్తోంది. చాలా బస్సులకు డ్యాష్ బోర్డు, అందులో భాగంగావున్న స్పీడో మీటర్లు కూడా పనిచేయడం లేదని ఆర్టీసి డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ బస్సులకు ఆయిల్ సీల్స్ పగిలిపోవడం వంటివి కూడా తరచూ జరుగుతున్నాయి. దీనివల్ల ఇంజిన్ ఆయిల్, పవర్ ఆయిల్ శరవేగంగా తగ్గిపోయే ప్రమాదం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా ఇంజిన్‌పై తీవ్ర ప్రభావం పడుతుంది. స్టీరింగ్, గేర్లు కూడా బిగుసుగుపోవడంతో డ్రైవింగ్ సవాలుగా మారుతుంది. వీటి కారణంగా మార్గ మధ్యలోనే బస్సులు ఆగిపోతున్నాయి. కొన్నిసార్లు బస్సు వేగంగా నడుస్తున్నప్పుడు బ్రేకులు పనిచేయకపోవడం, క్లైచ్ ప్లేట్లు పూర్తిగా పనిచేయకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. ఇటువంటి సాంకేతిక లోపం వల్లే ఇటీవల విజయవాడ, అనంతపురాల్లో ప్రమాదాలు సంభవించాయి.

మరోవైపు రీజియన్ పరిధిలో తగినంత సిబ్బంది లేరు. 160 బస్సులకు గాను 56మంది డ్రైవర్లు రోజువారీ కూలికి పనిచేస్తున్నారు. రెగ్యులర్ డ్రైవర్లు కూడా పరిమితంగా ఉండడంతో మొత్తం అందరి డ్రైవర్లపైనా పనిభారం, ఒత్తిడి పెరుగుతోంది. దీనికితోడు బస్సుల్లో డ్రైవర్‌కు తగిన సీటు ఉండడం లేదు. ముందు, వెనుక నుంచి వస్తున్న వాహనాలను తెలుసుకునేందుకు ఉపయోగించే అద్దాలు కూడా నాసిరకం వాడడంతో డ్రైవర్లు కొన్ని సందర్భాల్లో గందరగోళానికి గురికావాల్సిన దుస్థితి దాపురిస్తోంది. ఈ పనులు చేయాల్సిన కోచ్‌బిల్డర్ గ్యారేజి మొత్తానికి ఒకే ఒక్కడు ఉన్నాడు. అది కూడా ఔట్ సోర్సింగ్ కావడంతో రూ.12వేల వేతనానికి పనిచేస్తున్నాడు. ఇతను రోజుకు రెండు లేదా మూడు బస్సులకు మించి అద్దాలు అమర్చడం, సీట్లు సరిచేయడం వంటి పనులు చేస్తున్నాడు. దీంతో, మిగిలిన బస్సులన్నీ వీటిని సరిచేయకుండానే నడిపేస్తున్నారు. ఈ విషయంలో మెకానిక్ మొదలుకుని డిపో, రీజియన్ స్థాయి అధికారులకు తెలిసినా ఉన్నతాధికారులకు లేదా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లేంత స్వేచ్ఛ కూడా లేకపోతోంది. ప్రభుత్వం తనకు పట్టనట్టుగా వ్యవహరించడంతో ఆర్‌టిసి బస్సుల ప్రమాదాల పరంపర కొనసాగుతోంది. పండగలు పబ్బాలకు కూడా ఆర్‌టిసి మూలకు చేరిన బస్సులనే ఉపయోగిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నాయి. విజయనగరం డిపో పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు తొమ్మిది ప్రమాదాలు జరగ్గా నలుగురు వ్యక్తులు మృతి చెందారని, మరికొందరు గాయపడ్డారని ఆర్‌టిసి అధికారులే చెబుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

రహదారి ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నాం. ప్రస్తుతం మూడు జిల్లాలకు చెందిన డ్రైవర్లకు రోజుకు 40మంది చొప్పున శిక్షణా తరగుతులు నిర్వహిస్తున్నాం. ప్రమాదాల్లో కొన్ని మానవ తప్పిదాలవల్ల, మరికొన్ని సాంకేతిక లోపాల వల్ల జరుగుతున్నాయి.

సిహెచ్. అప్పలనారాయణ, జిల్లా ప్రజారవాణా అధికారి

గాజాపై ఇజ్రాయిల్ దాడులను ఖండించండి

10న మండల కేంద్రాల్లో నిరసనలకు వామపక్షాల పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వామపక్ష పార్టీల నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, రంగరాజు ఖండించారు. ప్రపంచ శాంతిని నెలకొల్పాలంటూ ఈ దాడులకు వ్యతిరేకంగా నవంబర్ 10వ తేదీన రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద, మండల కేంద్రాల్లోను నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. బుధవారం ఎల్‌బిజి భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అమెరికా తన ఆధిపత్యం కోసం, చమురు కోసం పాలస్తీనా, ఇజ్రాయిల్ దేశాల మధ్య జాత్యహంకార చిచ్చులు రేపి యుద్ధానికి ఆద్యం పోసిందన్నారు. చిన్నపిల్లలను, మహిళలను విడిచి పెట్టకుండా శరణార్థ శిబిరాల వద్ద కూడా బాంబులు వర్షం కురిపించి ప్రాణ, ఆస్తి నష్టానికి కారణమైందన్నారు. ఈ దుశ్చర్యలను ప్రపంచ దేశాలు, ఐక్యరాజ్యసమితి ఖండిస్తున్నప్పటికీ అమెరికా యుద్ధాన్ని ప్రోత్సహిస్తుందని అన్నారు. ఈ విషయంలో ప్రపంచ దేశాలన్నీ ఖండిస్తుంటే దేశ ప్రధాని మోడీ మాత్రం నోరు విప్పటం లేదని విమర్శించారు. గాజాపై దాడులను ఆపాలని ప్రపంచశాంతి నెలకొల్పాలని కోరుతూ నవంబర్ 10వ తేదీన జరిగే నిరసన కార్యక్రమాల్లో ప్రజలు, ప్రజాతంత్ర వాదులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి, టివి రమణ, ఆర్. శంకర్రావు పాల్గొన్నారు.

డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

అభినందన సభలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

నగరంలో 12రోజుల పాటు జరిగిన డ్వాక్రాబజార్ విజయవంతం కావడం పట్ల డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన చేతి ఉత్పత్తి దారులు తయారు చేసిన వస్తువులను పెద్ద ఎత్తున కొనుగోలు చేసి ఆదరించారని అన్నారు. జిల్లా కేంద్రంలోని లోయర్ టాంక్ బండ్ రోడ్డులో నిర్వహించిన సరస్ ముగింపు సందర్భంగా బుధవారం ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రభుత్వ శాఖలు, సంస్థల వారికి అభినందన సభ జరిగింది. ఈప్రదర్శనకు ప్రజల నుంచి ఏ విధమైన ఆదరణ వుంటుందో అనే సందేహాల నేపథ్యంలో రూ.6.39 కోట్ల వ్యాపారం జరిగిందని డిప్యూటీ స్పీకర్ అన్నారు. బజార్ నిర్వహణకు జిల్లా యంత్రాంగం, డిఆర్‌డిఎ అధికారులు చేసిన కృషిని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అభినందించారు డ్వాక్రా బజార్ లో మొత్తం 195 స్టాల్ లు ఏర్పాటయ్యాయనీ ఇందులో మన రాష్ట్రం నుంచి 152, మరో 14 రాష్ట్రాల నుంచి 45 స్టాల్ లు ఏర్పాటైనట్లు డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సహధిత్ వెంకట్ త్రివినాగ్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, మెప్మా పీడీ సుధాకర్, డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యాన నేడు రైతు గర్జన

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ఆధ్వర్యాన గురువారం రైతుగర్జన పేరిట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు సరగడ రమేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సిడబ్ల్యుసి నాయకులు రఘువీరారెడ్డి, పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రమేష్ కుమార్ మాట్లాడుతూ ఈ రైతు గర్జన కార్యక్రమం స్థానిక ఎత్తి బ్రిడ్జి వద్ద రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం అక్కడ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీరులేక వరి చేలు ఎండిపోయి కరువు పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 103 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించినప్పటికీ ఉమ్మడి జిల్లాలో ఒక్క మండలాన్ని కూడా కరువుగా గుర్తించకపోవడం అన్యాయమని అన్నారు. రైతులకు సకాలంలో నీరులేక వరిపంట బీడు భూములుగా మారాయని తెలిపారు. ఈనేపథ్యంలో నిర్వహించనున్న రైతు గర్జనకు రైతులంతా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డోల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు సుంకరి సతీష్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు రెహమాన్, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 29వ డివిజన్లో వివిధ అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. రూ.29 లక్షలతో చేపట్టిన సిసి రహదారులు, రూ.20 లక్షలతో నూతనంగా ఏర్పాటుచేసిన పార్కును ప్రారంభించారు. పార్కులో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి, సేదదీరేందుకు బెంచీలను,పిల్లల కోసం క్రీడా పరికరాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ నగరం అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా పయనించేందుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, డివిజన్ ఇంఛార్జి కృష్ణారెడ్డి, యూత్ అధ్యక్షుడు గుణశేఖర్, అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ సక్సెస్

విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యాన పలుచోట్ల ర్యాలీలు, మానవహారాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ, కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకై విద్యార్థి, యువజన సంఘాలు బుధవారం చేపట్టిన బంద్ జిల్లాలో విజయవంతమైంది. నగరంలోను, జిల్లాలోని పలు మండల కేంద్రాల్లోను విద్యార్థులను తరగతులు బహిష్కరించి బంద్‌లో పాల్గొన్నారు. పలు విద్యాసంస్థలు స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం బంద్‌కు మద్దతు ప్రకటించి ముందుగానే సెలవు ప్రకటించాయి. ఈ సందర్భంగా విజయనగరం కోట జంక్షన్ వద్ద విద్యార్థులు నిరసన, అనంతరం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.నాగభూషణం, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి కె.గౌతమి మాట్లాడారు. 32 మంది ప్రాణ బలిదానంతో ఏర్పాటై లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను కారు చౌకగా అదానీ అంబానీలకు కట్టబెట్టడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికులు వెయ్యి రోజులుగా చేస్తున్న స్టీల్‌ప్లాంట్ రక్షణ పోరాటానికి విద్యార్థులు, యువజనుల సహకారం ఉంటుందని తెలిపారు. వెనుకబడిన ఉత్తరాంధ్రకు విభజన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ఉత్తరాంధ్ర ఆత్మగౌరవంగా ఉన్నటువంటి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం చేయడం తీరని ద్రోహమని, దానికి వత్తాసు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలోనే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కడప స్టీల్ ప్లాంట్ కు నిర్మాణం వెంటనే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రుద్రరాజు, హరీష్ , ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూర వాసు, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, సౌమ్య, రామకృష్ణ పి. గౌరీశంకర్, ఎ.సుమన్ తదితర విద్యార్థి యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలి : విద్యార్థి సంఘాలు చేపట్టిన బంద్ పట్టణంలో జయప్రదమైంది. పలు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయి. పొట్టిశ్రీరాములు బాలికల హైస్కూలు, గొల్లపేట జెడ్‌పి హైస్కూలును ఎస్ఎఫ్ఐ నాయకులు దగ్గరుండి మూయించారు. పలు ప్రభుత్వ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ ఐటిఐ కళాశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి అన్ని విధాలుగా మోసం చేసిన బిజెపి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ పరం చేస్తోందని తెలిపారు. విద్యార్థులు, యువకులు కలిసి ఈ ప్రయత్నాలను అడ్డుకోవాలని అన్నారు. ఎఐవైఎఫ్ నాయకులు అప్పన్న, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రవి, ఎస్ఎఫ్ఐ నాయకులు వాసు,డేవిడ్ పాల్గొన్నారు.

గజపతినగరం : బంద్‌తో మండలంలోని ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, మరుపల్లి మోడల్ స్కూలు, ప్రైవేటు పాఠశాలలు మూతపడ్డాయి. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.రాము, డివైఎఫ్ఐ నాయకులు తాతినాయుడు, మండల నాయకులు చిన్నారి, నందిని, శిరీష, ఈశ్వరరావు, వెంకటేష్ ఆధ్వర్యాన బంద్ జరిగింది.

కొత్తవలస : విద్యార్థి సంఘాలు చేపట్టిన బంద్ జయప్రదమైంది. ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలను, ప్రైవేట్ పాఠశాలలు మూతపడ్డాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు నాయుడు,చైతన్య మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటుకరణ ఆపాలి, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు గణేష్,తేజ,భరత్ తదితరులు, పాల్గొన్నారు

బొబ్బిలిలో తరగతులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

బంద్‌తో మూతపడిన విజయనగరంలోని కస్పా హైస్కూలు

శృంగవరపుకోట : ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వి.చినబాబు ఆధ్వర్యాన విద్యార్థులు తరగతులను బహిష్కరించి బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు బోసుబొమ్మ జంక్షన్ వరకు ర్యాలీనిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారం చేపట్టారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేస్తే విద్యార్థిలోకం ఉద్యమిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రమేష్, కళ్యాణి, జ్యోతి, భార్గవి, రమాదేవి, ప్రశాంతి, రాము, రవి, డివైఎఫ్ఐ నాయకులు సతీష్, రిషి తదితరులు పాల్గొన్నారు.

జామి : మండలంలోని పలు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ లో పాల్గొన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను ఎస్ఎఫ్ఐ నాయకులు దగ్గరుండి మూయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి అన్ని విధాలుగా మోసం చేసిన బిజెపిని తరిమికొట్టాలని అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటుకరణ ఆపాలని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, రవి తదితరులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు

బాడంగి : బంద్‌తో కోడూరు, బాడంగి జెడ్‌పి హైస్కూళ్లు, షికారుగంజి మోడల్ స్కూలు, రామచంద్రపురం, పిన్నవలస, పూడువలస ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు జోగి హరికృష్ణ మాట్లాడారు.

గరివిడి : చీపురుపల్లి, గరివిడిలో విద్యాసంస్థల బంద్ జయప్రదమైంది. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులు, యువజనులు కలిసి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, రమణ, ప్రసాద్, సాయి, మేఘన, రూప తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : ప్రభుత్వ హైస్కూలు, కళాశాలల విద్యార్థులు తరగతులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా సహాయ కార్యదర్శి జె.రవికుమార్ మాట్లాడారు. బాలాజీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిపిఎస్ ఖర్చులను ప్రభుత్వమే భరించాలి

ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ధాన్యం రవాణా వాహనాలకు జిపిఎస్‌లను బిగించే నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని, లేనియెడల ప్రభుత్వమే జిపిఎస్‌కు అయ్యే ఖర్చు పెట్టుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది నుంచి అన్ని వాహనాలకు జిపిఎస్ యంత్రాలను అమర్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంతో మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ధాన్యం రవాణా చేసే వాహనాలకు జిపియస్ పరికరాలను అమర్చాలని నిర్ణయించిందన్నారు. జిపిఎస్ యంత్రాలను రవాణా చేసే ధాన్యం సరుకు బ్లాక్ మార్కెట్ కు తరలించే లేదా ట్రక్ షీట్ జనరేట్ అయిన మిల్లుకు చేరకుండా వేరే చోటకు తరలించే వాటిని ట్రాక్ చేయడానికి ఉపయోగిస్తారని తెలిపారు. కానీ రైతాంగం తమ ధాన్యాన్ని వేరే చోటకు తరలించి బ్లాక్ మార్కెట్ చేసే పరిస్థితి లేదని, ప్రభుత్వానికి అమ్ముకోవడం ఇష్టం లేకపోతే ప్రైవేటు వారికీ అమ్ముకుంటారని తెలిపారు. ధాన్యం రవాణాకు ఏర్పాటు చేసే ట్రాక్టర్లు లారీలు ఇతర వాహనాలకు జిపిఎస్ పరికరాలను అమర్చితే ఆ భారాన్ని ప్రభుత్వమే భరించాలని తెలిపారు. జిపిఎస్ పరికరాలకు అయ్యే ఖర్చు వాహన యజమానులే భరించాలని చెప్పడం సరికాదని పేర్కొన్నారు.

బోడికొండ పోరాట నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

బోడికొండపై గ్రానైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన పోరాట కమిటీ నాయకులపై పెట్టిన కేసును న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. పార్వతీపురం మండలంలోని బొడ్డవలస పంచాయతీలో బోడికొండపై అక్రమ గ్రానైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా 2016 నుంచి పోరాట కమిటీ ఆధ్వర్యాన అనేక రూపాల్లో ఆందోళనలు సాగాయి. కంపెనీ యాజమాన్యం, పార్వతీపురం రూరల్ పోలీసులు, అధికారులు కలిసి 2018లో పోరాట కమిటీ నాయకులు, గిరిజనులు 31 మందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును బుధవారం న్యాయ స్థానం కొట్టివేసింది. పోరాట కమిటీ నాయకుల తరుపున న్యాయవాదులు శాంతిరాజు మన్మథరావు, కృష్ణ వాదనలు వినిపించారు. ఈ ఉద్యమంలో కీర్తిశేషులు, సిపిఎం జిల్లా పూర్వ కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి కీలకపాత్ర పోషించారు. ఈ కేసులో ఎ1గా టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఉన్నారు. వీరితోపాటు అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు పోలా ఈశ్వరరావు, పాలక రంజిత్ కుమార్, వెలగాడ కృష్ణ, పోలా రమణి తదితరులను నిందితులుగా చేర్చారు.

పిటిషనర్లతో స్నేహపూర్వకంగా మాట్లాడాలి

జగనన్నకు చెబుదాంలో కలెక్టర్

ప్రజాశక్తి-తెర్లాం

పిటిషన్ల తీవ్రతను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నాణ్యమైన పరిష్కారాన్ని ఇవ్వాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. పిటిషనర్ల తో స్నేహ పూర్వకంగా మాట్లాడి వారి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. బుధవారం తెర్లాం మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి కలెక్టర్ వినతులను స్వీకరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. గడువు లోగా వినతులను పరిష్కరించాలని తెలిపారు. మొత్తం 48 వినతులు అందాయి. వీటిలో ఎక్కువగా రెవిన్యూ కు చెందినవి 20 కాగా సోషల్ వెల్ఫేర్ శాఖ కు చెందినవి 13 , హౌసింగ్‌కు 2 , విద్యుత్ శాఖకు సంబంధించినవి 4 , వెటర్నరీకి సంబంధించి 2, వైద్య విధాన పరిషత్, ఉన్నత విద్య, వ్యవసాయం, పబ్లిక్ హెల్త్, ఇరిగేషన్, సర్వే, పంచాయతి రాజ్ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున వినతులు అందాయి. వినతుల స్వీకరణలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, బొబ్బిలి ఆర్‌డిఒ శ్రీ సాయి, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఎంపిడిఒ రామకృష్ణ, తహశీల్దార్ రత్నకుమార్, జిల్లా స్థాయి , మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఎసిబి కేసులో ఎడిఇకి నాలుగేళ్ల జైలుశిక్ష

ప్రజాశక్తి-విజయనగరం

2013లో ఎలక్ట్రికల్ లైన్ వేయడానికి ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకున్న కేసులో అప్పటి శ్రీకాకుళం జిల్లా పలాస ఎడిఇ, ప్రస్తుతం ఏలూరులో ఇఇగా పనిచేస్తున్న శాసపు మధుసూదనరావుకు విశాఖ ఎసిబి కోర్టు నాలుగేళ్ల జైలుశిక్ష విధించింది. బుధవారం ఎసిబి కోర్టు న్యాయమూర్తి ఆర్‌వివిఎస్ మురళీకృష్ణ ఈమేరకు తీర్పునిచ్చారు. 2013లో పలాసకు చెందిన కె.ప్రేమ్‌కుమార్ తన తల్లి పేరుమీదు రైసుమిల్లు నిర్మించుకున్నాడు. ఈ మిల్లుకు ఎలక్ట్రికల్ లైన్ వేయడానికి పలాస ఎడిఇ శాసపు మధుసూదనరావును సంప్రదించగా, ఆయన రూ.20వేలు డిమాండ్ చేశారు. దీంతో ప్రేమ్‌కుమార్ ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈనేపథ్యంలో అతని నుంచి ఎడిఇ లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకొని అరెస్టు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో కోర్టు మధుసూదనరావుకు నాలుగేళ్ల కఠిన శిక్ష, 6నెలలు సాధారణ జైలు శిక్ష, రూ.20వేలు జరిమానా విధించిందని ఎసిబి డిఎస్‌పి పి.రామచంద్రరావు తెలిపారు.

వైసిపి కార్యకర్తల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-మెంటాడ

వైసిపి ఆధ్వర్యాన సాలూరులో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర బహిరంగ సందర్భంగా బుధవారం పోరాం నుంచి సాలూరు వరకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు రాయపల్లి రామారావు, జెడ్‌పిటిసి లెంక సన్యాసి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఈ బైక్ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ బడుగు బలహీన వెనుకబడిన వర్గాలకు సమన్యాయం చేయాలని సంకల్పించి రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర మాట్లాడుతూ కుంటినవలసలో గిరిజన యూనివర్శిటీ నిర్మాణానికి సిఎం శంకుస్థాపన చేశారని, దీనివల్ల గిరిజనులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం గిరిజనులకు ఒక్క పథకం కూడా ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో సామాజిక సాధికారక బస్సుయాత్ర ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, మన్యం జిల్లా పార్టీ అధ్యక్షులు పరీక్షిత్ రాజు, జిసిసి చైర్‌పర్సన్ స్వాతీరాణి, ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపిపిలు సారికి ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ , సచివాలయం మండల కన్వీనర్ కనిమెరక త్రినాధరావు, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ లచ్చిరెడ్డి అప్పలనాయుడు, పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

పోరాం నుంచి సాలూరు వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి కార్యకర్తలు

తాగునీటి సరఫరాపై భగ్గుమన్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి-బొబ్బిలి

మాట్లాడుతున్న వైస్ చైర్మన్ చెలికాని మురళీ

మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాపై అధికార పార్టీ కౌన్సిలర్లు భగ్గుమన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. మున్సిపాలిటీలో ఎప్పటికప్పుడు తాగునీటి సరఫరా నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా తాగునీరు సరఫరా చేయాలని కౌన్సిలర్ కోట పెదరాములు డిమాండ్ చేశారు. పురాతన పైపులైన్ కావడంతో లీకులు వలన తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కమిషనర్ శ్రీనివాసరావు చెప్పారు. లీకులను నివారించి తాగునీరు సరఫరా చేస్తామన్నారు. శ్మశాన వాటికలలో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.72లక్షలతో తీర్మానం చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలను సందర్శించిన డిఇఒ

తెర్లాం: స్థానిక ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వరరెడ్డి బుధవారం సందర్శించారు. ఇందులో భాగంగా స్కూల్‌లో విద్యార్థుల వర్క్ బుక్స్ కరెక్షన్ పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో విద్యార్థుల అభ్యసన స్థాయిలు, సిలబస్ పూర్తి, వెనుకబడిన విద్యార్థులు పట్ల తీసుకోవలసిన ప్రత్యేక శ్రద్ధ గూర్చి తగు సూచనలు చేశారు. సిలబస్ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పూర్తి చేసి, వర్క్ బుక్స్ కరెక్షన్ చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పనితీరు, లెసన్ ప్లాన్స్, డైరీలు, సిలబస్ పూర్తి చేయాలని, వెనుకబడిన విద్యార్థులు పట్ల తీసుకోవలసిన చర్యలు గూర్చి పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ త్రినాథ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారికి రూ.51వేలు ఆర్థిక సాయం

శృంగవరపుకోట: విజయనగరం పట్టణానికి చెందిన ఆర్నా (6) అనే బాలిక తలసేమియా వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం పలువురు ద్వారా తెలుసుకున్న ఎస్.కోటకు చెందిన న్యాయవాది గిడుతూరి చిట్టిబాబు రూ.51వేల నగదును ఆర్థిక సాయంగా బాలికకు కుటుంబ సభ్యుల సమక్షంలో బుధవారం అందించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ తన స్నేహితులు అందజేసిన ఆర్థిక సహాయంతో పాటు తన నిధులను జత చేసి ఈ రూ.51వేల నగదును అందజేసామని తెలిపారు. తనకు సహకరించి నగదు అందజేసిన స్నేహితులకు చిట్టిబాబు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.272 పొందేలా పని చేయాలి

మెరకముడిదాం: గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న ప్రతి వేతన దారుడు రూ.272 కూలి పొందేలా పని చేయాలని బైరిపురం సర్పంచ్ పప్పల విజయ కుమారి తెలిపారు. బుధవారం గ్రామ సచివాలయంలో జరిగిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. ముందుగా సామాజిక తనిఖీ అధికారి డిఆర్పీ రామకృష్ణ మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి సంబంధించి చేపట్టిన 81పనులకు గాను రూ.1.63కోట్లు ఖర్చుపెట్టామన్నారు. పంచాయతీ రాజ్‌కి సంబంధించి ఏడు పనులకు గాను రూ.31.58లక్షలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఈ పనులతో పాటు గ్రామంలో పంపిణీ చేస్తున్న 471 పింఛన్లపై సామాజిక తనిఖీ చేపట్టామన్నారు. ఉపాధి పనుల మస్తర్లలో ఒక రెండు దిద్దు బాట్లు తప్ప మరి ఎక్కడ పొరపాట్లు లేవని తమ దృష్టికి వచ్చిందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పప్పల గ్రహణేశ్వరరావు, కందుల మల్లిఖార్జునరాయి, ఫీల్డ్ అసిస్టెంట్ బూడి శ్రీనివాసరావు వేతన దారులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

వేపాడ: మండలంలోని వావిలిపాడులో ఇటీవల మృతి చెందిన పాడి రైతులు గొల్లి అప్పలనాయుడు, బూడి దమ్మునాయుడు, బూడి ముత్యాల నాయుడులకు సంబంధించిన కుటుంబాలకు బీమా సొమ్ము ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున చెక్కులను వైసిపి నాయకులు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల కేంద్రం అధ్యక్షుడు బూడి శ్రీను, సచివాలయ కన్వీనర్, పాలకేంద్ర డైరెక్టర్ బీల సతీష్, పాల కేంద్రం సెక్రెటరీ బూడి వెంకటరావు, డైరెక్టర్ కర్రీ త్రినాథ్, వార్డు మెంబర్ చినబాబు, పైడపుడు, పైడిబాబు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ

నెల్లిమర్ల: ఆలిండియా రైల్వే వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కొండ వెలగాడ క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. బుధవారం 70వ అలిండియా రైల్వే వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్, 9వ ఉమెన్ ఆలిండియా రైల్వే వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడకు చెందిన మత్స సంతోషి, వల్లూరు చిన్నం నాయుడు, కోరాడ రమణ ప్రతిభ కనబర్చారు. ఈ నెల 6 నుంచి 9 వరకు మహారాష్ట్ర ముంబైలో జరిగిన ఆలిండియా రైల్వే వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు 2023-24 వెస్ట్రన్ రైల్వే స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఈ పోటీల్లో మత్స సంతోషి 55 కిలోల విభాగంలో 146 కిలోల బరువెత్తి 3వ స్థానం, వల్లూరి చిన్నం నాయుడు 55 కిలోల విభాగంలో185 కిలోల బరువెత్తి 3వ స్థానం, కోరాడ రమణ 67 కిలోల విభాగంలో 252 కిలోల బరువెత్తి 2వ స్థానం సాధించారు. ఈ సందర్భంగా వారిని జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ గదల బంగారమ్మ, నాయకులు మొయిద అక్కోజి, గ్రామస్థుల అభినందించారు.

స్పీకర్‌ను కలిసిన శంబంగి

బొబ్బిలి: శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఆయన సోదరుడు వేణుగోపాలనాయుడు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సాలూరులో జరగనున్న సామాజిక సాధికార యాత్ర సభకు వచ్చిన స్పీకర్‌ను కలిసి రాజకీయ పరిస్థితులపై చర్చించారు. వైసిపి విజయానికి ఐక్యంగా పని చేయాలని శంబంగిను సీతారాం కోరారు.

కాలువలో చెత్త వేస్తే చర్యలు

బొబ్బిలి: రోడ్లు, కాలువలలో చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఐటిఐ కాలనీలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, కాలువలలో చెత్త వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ఇళ్లలోనే తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలించి వేగవంతం చేయాలని కోరారు.

దిశ యాప్ విద్యార్థులకు ఎంతో అవసరం

రేగిడి: దిశ యాప్ విద్యార్థులకు ఎంతో అవసరమని దీని ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని ఎస్ఐ ఈ. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం దేవుదల కస్తూరిబా గాంధీ విద్యాలయంలో దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిశ యాప్ డౌన్లోడ్ చేసుకుంటే అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడుతుందన్నారు. అనుకోకుండా జరిగిన సంఘటనలకు యాప్ ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని ఆత్మరక్షణ పొందవచ్చునన్నారు. మహిళలకు విద్యార్థినిలకు ఈ యాప్ చాలా అవసరమని ఆయన వివరించారు. ఈ యాప్ గురించి గ్రామాల్లో విద్యార్థులకు, ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి ఎస్ఐ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రత్యేకాధికారి లక్ష్మీతోపాటు ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈశ్వర్ కౌశిక్ జన్మదిన వేడుకలు

విజయనగరం టౌన్: వైసిపి యువజన విభాగం నాయకులు ఈశ్వర్ కౌశిక్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు వార్డుల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారు. 29వ డివిజన్‌లోని పార్కులో అభిమానుల నడుమ తొలుత ఈశ్వర్ కౌశిక్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్ దంపతులకు పుష్పగుచ్చాలు ఇచ్చి పలువురు అభినందనలు తెలిపారు. శాలువలతో సత్కరించారు. అనంతరం కుసుమహరనాథ్ క్షేత్రంలోని వద్ధాశ్రమానికి కౌశిక్ దంపతులు శీతలీకరణ యంత్రాన్ని అందజేశారు. ఫూల్ బాగ్ కాలనీ, మంగళ వీధిలో ఉన్న అంధుల పాఠశాలకు ఇన్వర్టర్‌ను అందజేశారు. ఫూల్ బాగ్ లో ఉన్న ద్వారకామయి అందుల పాఠశాలకు ఫ్యాన్లను అందజేశారు. పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ అన్నదాన ట్రస్ట్‌కు విరాళాన్ని అందజేశారు. పైడితల్లమ్మ దేవస్థానం కళ్యాణ మండపంలో అన్నదానాన్ని నిర్వహించారు. పేర్ల వారి వీధిలో ఉన్న బదిర పాఠశాలకు ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లను అందజేశారు. ద్వారపూడిలో వృద్ధాశ్రమానికి టివిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌశిక అభిమానులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న గ్రామాలు

- పడకేసిన పారిశుధ్యం
- తప్పని దోమల బెడద
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. దీంతో గ్రామాలు దుర్వాసనతో కంపుకొడుతున్నాయి. ముఖ్యంగా పెద బూరాడ పేట, నారాయణపట్నంలో ఏ కాలువ చూసినా మురుగుతోనే దర్శనమిస్తున్నాయి. అసలు ఈ గ్రామంలో ఒక్కసారి కూడా పారిశుధ్యం పనులు చేసిన పరిస్థితి లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఎన్నో రోజులుగా కాలువల్లో మురుగు తొలగింపు చేయక పోవడంతో నిండిపోయి వీధుల్లో రహదారి పైన మురుగు నీరు పారుతుంది. దీంతో దోమలు, డెంగీ వంటి అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల ఏటి అగ్రహారం, సారిపల్లి గ్రామాల్లో పారిశుధ్య లోపంతో డయేరియా ప్రబలి చాలా మంది ఆస్పత్రి పాలయ్యారు. ప్రభుత్వం ఒక పక్క జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నా పారిశుధ్యంపై మాత్రం దృష్టి పెట్టడం లేదని చెబుతున్నారు. గ్రామాలకు మెరుగైన సేవలు అందించడానికి సచివాలయం వ్యవస్థ ఏర్పాటు చేసినప్పటికీ పారిశుధ్యం వంటి సేవలు అందకుండా పోతున్నాయని ఆయా గ్రామ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త, వ్యర్థాలు వీధుల్లో రహదారి మీదే దర్శన మిస్తున్నాయి. వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది ఉన్నా ఎవరూ పారిశుధ్యం పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టి అంటు రోగాలు నివారించాలని కోరుతున్నారు.

ఇదీ బూరాడపేట కాలువ పరిస్థితి

నారాయణపట్నం కాలువలో పేరుకుపోయిన మురుగు

పంట నష్టం పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తి రెవెన్యూ పరిధిలో గల గోపాల రాయుడు చెరువు, కనుముల చెరువు, నాగారాయుడు చెరువు కింద ఉన్న ఆయకట్టు రైతుల వరి పంట పొలాలు వర్షాలు లేక ఎండిపోయాయి. పంట నష్ట పరిశీలన చేయాలని రైతులు సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ జ్యోతిని కోరగా బుధవారం ఆమె పంట నష్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మద్దాల నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతును ఆదుకోవాలని కోరారు.

దెబ్బ తిన్న పంటను పరిశీలిస్తున్న విఎఎ జ్యోతి, ఉప సర్పంచ్ నాయుడు

ప్రభుత్వం వరి రైతును ఆదుకోవాలి

నెల్లిమర్ల: ప్రభుత్వం వరి సాగు చేస్తున్న రైతును వెంటనే ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన తెగుళ్ల సోకిన వరిపంటను జరజాపుపేటలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వర్షాభావ పరిస్థితుల్లో వరిపంటకు తెగుళ్ళ సోకి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వర్షం లేక ఒకపక్క దోమపోటు, అగ్గి తెగులు సోకి మరో పక్క 50 శాతం పంట కూడా దక్కే పరిస్థితి లేదన్నారు. ఎకరానికి 50వేలకు పైగా ఖర్చు పెట్టిన రైతుకి ప్రస్తుతం తిండి గింజలు కూడా రాని పరిస్థితి ఉందన్నారు. అధికార్లు ఏదో మొక్కుబడిగా వచ్చి పంటలను పరిశీలించి వెళ్తున్నారు గాని వారికి అవసరమైన పంటను ఎలా కాపాడుకోవాలన్న విషయాలు చెప్పలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా తెగుళ్లకు తోడు పందులు కూడా వరి చెలోకి వచ్చి పంటను నాశనం చేస్తున్నాయన్నారు. వరి తెగుళ్ల నుంచి కాపాడు కోవడానికి కాలువలు వేసినా ప్రయోజనం కనిపించడం లేదని పంట కోత దశలో ఉన్నా పురుగుల మందులు కొట్టాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు.

నెల్లిమర్ల: తెగుళ్లను చూపిస్తున్న రామారావు

అన్నదాత పై ప్రభుత్వానికి అంత నిర్లక్ష్యమా?

అన్నం పెట్టే అన్నదాతపై ప్రభుత్వానికి అంత నిర్లక్ష్యమా అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. నియోజకవర్గం పరిధిలో వర్షాభావ ప్రభావం వల్ల అనేక మంది రైతులు పంట నష్టపోయారని, అన్నదాతకు ఇంత నష్టం జరుగుతున్నా అధికార పార్టీ నాయకులు రైతుల వైపు కన్నెత్తి చూడకుండా బస్సు యాత్రలు చేసుకుంటున్నారని విమర్శించారు. ఎస్ కోట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడానికి ఏ ఒక్క నాయకుడు కృషి చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా స్థానిక నాయకులు, అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి వరి పంట నష్టపోయిన రైతులను గుర్తించి వారిని ఆదుకోవాలని కోరారు.

ఘనంగా ద్వారం జయంతి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రఖ్యాత వయొలిన్ విద్వాంసులు పద్మశ్రీ ద్వారం వెంకటస్వామినాయుడు 131వ జయంతి బుధవారం రోలర్ మ్యూజిక్ అకాడమీలో ఘనంగా జరిగింది. ముందుగా ద్వారం చిత్రపటానికి అకాడమీ కోఆర్డినేటర్ గుండ దిన వీరభద్రరావు, అకాడమీ సభ్యులు, అధ్యాపకులు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి ద్వారం జీవిత విశేషాలను వివరించారు. అనంతరం విద్యార్థులు తనూజ, రాహిత్య వయొలిన్ కచేరి అందరినీ అలరించింది. అధ్యాపకులు రవికుమార్, రామచరణ్, భానుహర్ష, మొకర నిర్మల, కామేశ్వరరావు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - విజయనగరం

చిత్తూరు జిల్లాలో ఈ నెల 9 నుంచి 11 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. విజయలక్ష్మి తెలిపారు. ఇటీవల గరివిడి మండలం కోడూరులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన డి. యుగంధర్, కె.హేమంత్, ఆర్.గిరి, ఎ. తులసి, ఎం. పూర్ణిమ అండర్ 14 విభాగానికి, బి. ఉదయశ్రీ, కె. అంజలి, డి. ఉమ అండర్ 17 విభాగానికి ఎంపికయ్యారని ఆమె తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను బుధవారం జెడ్‌పిటిసి కెల్ల శ్రీనివాసరావు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

క్రీడాకారులను అభినందిస్తున్న జెడ్‌పిటిసి శ్రీనివాసరావు

కుళాయి సరే.. నీరేది?

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామంలో జలజీవన్ పథకం కింద ఇంటింటికీ తాగునీరందించాలనే ఉద్దేశ్యంతో రూ.40లక్షలు పెట్టి వీధుల్లో పైప్‌లైన్ వేసి కుళాయి ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. కానీ ఎస్‌సి కాలనీలో ట్యాప్‌లు వేసినా వాటి ద్వారా పూర్తి స్థాయిలో తాగునీరు రావడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో 65 కుటుంబాలు ఉన్నాయని ఇంటింటికి పైప్‌లైన్ ఏర్పాటు చేసినప్పటికీ తాగునీటిని మాత్రం అందించడం లేదని చెబుతున్నారు. గతంలో జిల్లా పరిషత్ సిఇఒ మోహన్ రావు రూ.50 వేలతో కాలనీలో పూర్తిగా తాగునీరు అందే సౌకర్యం కల్పించారని ఇప్పుడు జలజీవన్ పథకం ద్వారా ఇంటింటికి తాగునీరందిస్తామని గతంలో ఇచ్చిన తాగునీటి పైపులను తొలగించారని చెబుతున్నారు. ఇప్పుడు కొత్త పైపుల ద్వారా తాగునీరు రాక, పాత పైపులైన్‌ను తొలగించడం ద్వారా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. పైగా పైపులైన్ ఏర్పాటు చేయడానికి గట్టిగా ఉన్న రోడ్డును కూడా తవ్వేసి నడవడానికి కూడా వీల్లేకుండా చేశారని చెబుతున్నారు. కుళాయిల ద్వారా తాగునీరు రాకపోవడంతో కాలనీలో ఉన్న బోరే తిరిగి వారికి జీవనాధరమైందని కుళాయిల ద్వారా తాగునీటిని అందించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవిని వివరణ కోరగా కాంట్రాక్టర్‌ను పంపించి కాలనీ వాసులకు తాగునీరు అందే విధంగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న కుళాయిలు

బిందె నీరు కూడా రాలేదు

ఇంటింటికి తాగినీటి సరఫరా చేస్తామని కుళాయి వేసి సుమారు నెలరోజులు కావస్తున్న ఒక బిందె నీరు కూడా రాలేదు. గతంలో మా ఇంటి వద్ద పైపు ఉండేది. ఆ పైపు ద్వారా పూర్తిగా నీరు అందేది. ఆ పైపును తీసివేసి ఇంటింటికి తాగునీరు ఇస్తామని కొత్తగా కుళాయిలు వేశారు. నెల రోజులు కావస్తున్న వాటి ద్వారా నీరు మాత్రం అందడం లేదు.

గొల్ల మహేష్, ఎస్‌సి కాలనీ, సింగరాయి

కెవికె వద్దంటూ నిరాహార దీక్ష

ప్రజాశక్తి- దత్తిరాజేరు

తమ గ్రామానికి చెందిన కొండ భూముల వద్ద కృషి విజ్ఞాన కేంద్రాన్ని (కెవికె) ఏర్పాటు చేయవద్దని చిన్న చామలపల్లి గొర్రెల, మేకల పెంపకం ఉత్తిదారులు ఇంగిలాపల్లి సచివాలయం వద్ద బుధవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, మాజీ ఎంపిటిసి మన్యాల ఎరుకునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తిదారులని నాశనం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. జిల్లాలో అనేక ప్రాంతాలలో ఇప్పటికే సేకరించిన భూములలో ఎటువంటి నిర్మాణాలూ చేపట్టలేదన్నారు. ఇప్పటికే సేకరించిన భూముల్లో కెవికె పెట్టుకోవాలని తమ భూములను వదిలేయాలని కోరారు ఈ కార్యక్రమంలో గుంట పోయిన తిరుపతిరావు, శంకర్రావు, బొమ్మిడి లక్ష్మణ, బోను రాములమ్మ, ఆవాల గౌడమ్మ దీక్షల్లో కూర్చున్నారు. వీరికి మద్దతుగా గ్రామ వృత్తిదారులంతా పాల్గొన్నారు.

దీక్షలను ప్రారంభిస్తున్న రాకోటి రాములు, జి.శ్రీనివాస్

నేరుగా ప్రజలకే పథకాలు

ప్రజాశక్తి- భోగాపురం

అవినీతికి ఆస్కారం లేకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నేరుగా పేదలకే పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని సవరవల్లి పంచాయితీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గ్రామసర్పంచ్ ఉప్పాడ విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి వివరించారు. వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలతో పాటు వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేసుకున్నామని వారికి వివరించారు. దీనికి ముందు ఎమ్మెల్యే ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్‌ను విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. నేటి నుంచి మండలంలో కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పలనాయుడు, తహశీల్దారు బంగార్రాజు, ఎంపిటిసి తాతయ్యలు, నాయకులు పడాల శ్రీనివాసరావు, భాను, కొల్లి రామ్మూర్తి, సుందర హరీష్, కర్రోతు వెంకటరమణ, ఎపిఒ ఆదిబాబు, ఎఒ హరిబాబు, వెలుగు ఎపిఎం రమణ పాల్గొన్నారు.

పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

ప్రజారక్షణ భేరి బహిరంగ సభకు తరలిరావాలి

ప్రజాశక్తి - వంగర

ఈ నెల 15న విజయవాడలో జరగనున్న సిపిఎం ప్రజా రక్షణ బేరి బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజానీకం తరలి రావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకర్రావు పిలుపునిచ్చారు. బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ వంగరలో బుధవారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. ప్రజల సమస్యలను గాలికి వదిలి అభివృద్ధిని గాలికి వదిలేసిన పరిస్థితి ఉందన్నారు. వీటికి వ్యతిరేకంగా భవిష్యత్తులో ప్రజా పోరాటాలకు ప్రజానీకాన్ని సిద్ధం చేసేందుకు, అసమానతలు లేని అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ కోసం, సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజారక్షణ భేరీ బస్సు జాతాలను, బహిరంగ సభలను జయప్రదం చేయాలని కోరారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 3 బస్సు జాతలను నిర్వహిస్తుందని, దేశంలో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు కలవరపరుస్తున్నాయని ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించవలసిన కాలం వచ్చిందని అన్నారు. రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్లు పూర్తి కావస్తున్నా ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్ట్, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, వెనక బడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు లాంటి విభజన హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణం చేతకాక వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానులు జపం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడిలకు, ఆశాలకు, గ్రామ సేవకులు, విద్యుత్తు, పంచాయతీ మున్సిపాలిటీ, కాంట్రాక్ట్, ఔట్స్ సోర్సింగ్ ఉద్యోగులకు చేసిన వాగ్దానాలు గాలికి ఎగిరిపోయాయన్నారు. వీటిపై ఉద్యమానికై చేపడుతున్న ప్రజారక్షణ బేరి బహిరంగ సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామ్మూర్తి నాయుడు, పి. విశ్వనాథం, అప్పలనాయుడు, ఆదినారాయణ, రామారావు, వెంకట నాయుడు, త్రినాధ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శంకరరావు

జెఎఎస్‌తో ఇంటింటికీ వైద్య సేవలు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఇంటింటికీ వైద్య సేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కాలనీలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పరిశీలించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇంటింటికీ వైద్య సేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు, విలేజ్ క్లినిక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఇందిరమ్మ కాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, కౌన్సిలర్ టి.పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

గుర్ల : రాష్ట్రంలో ప్రజలు అందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారని ఎంపిపి పొట్నూరు ప్రమీల అన్నారు. సురక్ష కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో మండలంలో పాలవలసలోని ఆమె స్వగృహంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందించాలన్న మంచి సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. సుమారు నెలరోజులు పాటు మండలంలో అన్ని సచివాలయాల పరిధిలో చేపట్టిన సురక్ష శిబిరాలు మంచి ఫలితాలను ఇచ్చాయన్నారు. మండలంలో 10,957 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని,మరో 2,247 మంది నేత్ర పరీక్షలు చేయించుకున్నారన్నారు.

విజయనగరం టౌన్: నగరంలోని బ్యాంకు కాలనీ లోగల 41వ నెంబరు సచివాలయంలోను, ఆది ఆంధ్ర పాఠశాలలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజాస్పందన లభించింది. ముందుగా వాలంటీర్ల ద్వారా సర్వే జరిపించి అవసరమైన వారందరికీ వైద్య పరీక్షల నిమిత్తం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను ఆయా డివిజన్ల కార్పొరేటర్‌తో పాటు నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాద్‌రావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నగరంలో 49 సచివాలయాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్య క్రమం పూర్తిచేశామన్నారు. స్థానిక వైసిపి నాయకులు బాలి ప్రతాప్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో విద్యా వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పోలిపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని పోలిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో టిడిపి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఇంటి ఇంటికి తిరిగి భవిష్యత్తుకు గ్యారెంటీ త్ గ్యారెంటీ బాండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, క్లస్టర్ ఇంఛార్జి దాసరి అప్పలస్వామీ, తెలుగుయువత పార్లమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి కర్రోతు రాజు, గ్రామ టిడిపి అధ్యక్షులు చింతపల్లి రామకృష్ణ, బూత్ ఇంఛార్జిలు పాల్గొన్నారు.


మేనిఫెస్టో గురించి వివరిస్తున్న కర్రోతు

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
E.P.No. 115/2021 in F.D.I.A.No. 803/2016 in O.S.No. 85 / 2012

Between:
Sri R.Krishna Rao ... Decree Holder/ Petitioner/Plaintiff
And:
Sri B.V.V.Ramesh Kumar and Another ...Judgment Debtors / Respondents / Defendants
To
The 2nd Judgment Debtor/ 2nd Respondent / 2nd Defendant:
Smt. Borra Naga Sireesha,
D/o. Veera Venkata Ramesh Kumar,
D.No. 4-110/A,
Baddukondapeta Road,
Cheluvuru Village,
Vizianagaram Mandal and District.

Take notice that the above execution petition filed by the decree holder against the Judgment debtors is stands posted to **07-12-2023 at 10-30 A.M.** before the above court for your appearance, failing which the matter will be decided in your absence.

K.V.N.THAMMANNA SETTY
Advocate for the Decree Holder / Petitioner / Plaintiff
Ex. Govt. Pleader,
Ex. Municipal Standing Counsel,
Vizianagaram.
Cell:8639977334

రోడ్డు ప్రమాదంలో బౌన్సర్ మృతి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోదవలస వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బౌన్సర్ కిరణ్(20) మృతి చెందాడు. విశాఖపట్నం పెదగంట్యాడకు చెందిన కిరణ్ ప్రయివేటు ప్రోగ్రామ్ నిర్వహకుని వద్ద బౌన్సర్‌గా పనిచేస్తున్నాడు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి విజయనగరంలో కార్యక్రమాన్ని పూర్తి చేసుకుని రాత్రి 12 తరువాత ద్విచక్ర వాహనంపై తన స్నేహితునితో కలిసి విశాఖపట్నం బయలు దేరాడు. మోదవలస వద్దకు వచ్చేసరికి ఎదురుగా పశువులు లోడుతో వస్తున్న బొలేరు వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం పై ఉన్న ఇద్దరికీ గాయాలయ్యాయి. వీరిని వెంటనే స్థానికలు తగరపువలస వద్ద ఉన్న ఒక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న కిరణ్ మృతి చెందాడు. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న అతని స్నేహితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

నష్ట పరిహారం ఇవ్వాలని ఆందోళన

ఆస్పత్రిలో మృతి చెందిన కిరణ్ మృతదేహాన్ని అక్కడి నుంచి జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ బుధవారం ఉదయం పోస్టుమార్టం జరగాల్సి ఉన్నా కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో నిలిపివేశారు. తమకు నష్ట పరిహారం ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం డెంకాడ పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. మృతిని కుటుంబాన్ని బోలేరు వాహనం యజమాని ఆదుకోవాలని, నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు బొలేరు వాహనాన్ని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

కిరణ్ (ఫైల్)

కారు చోరీకి పాల్పడిన ఇద్దరు అరెస్ట్

విజయనగరం : పట్టణంలో గ్రూప్ సముదాయంలో నివాసం ఉంటున్న మౌళి అనే వ్యక్తికి చెందిన కారును పలాసకు చెందిన పాలక కేశవరావు, పర్లాకిమిడి కి చెందిన మీసాల గోవింద్ అనే ఇద్దరు దొంగిలించారని వారిద్దరినీ అరెస్టు చేసి, రిమాండుకు తరలించామని, కారును స్వాధీనం చేసుకున్నామని ఒకటో పట్టణ సిఐ వెంకటరావు బుధవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. కారు యజమాని పోగొట్టుకున్న కారు స్పేర్ కీని ఉపయోగించి నిందితులు కారు చోరీకి పాల్పడి, టోల్ గేట్ల మార్గంలో కాకుండా వేరే మార్గంలో పలాస తీసుకొని వెళ్లిపోయారు. కారును తాకట్టు పెట్టే క్రమంలో పోలీసులకు పట్టుబడినట్లు సిఐ తెలిపారు. ఈ కేసును చేధించిన వన్ టౌన్ ఎస్ఐలు అశోక్ కుమార్, నరేష్, హెచ్.సి. అచ్చిరాజు, కానిస్టేబుళ్లు శ్రీను, శివ, గౌరీ శంకర్‌లకు రివార్డు మంజూరు చేసేలా ఎస్‌పికి ప్రతిపాదిస్తానని సిఐ చెప్పారు.